క్లుప్తంగా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కేతిరెడ్డి బ్రదర్స్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కేతిరెడ్డి సోదరులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి ఆయన అన్న ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డితో కలసి గురువారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడిపత్రి రాజకీయ పరిస్థితులపై ఆరా తీసినట్లు తెలిసింది. అలాగే పలు అంశాలపై చర్చించారు.

ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రీన్ భారత్ సొసైటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: పట్టణంలో ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు తీసుకోవాలని గ్రీన్ భారత్ సొసైటీ చైర్మన్ సభ్యులు కమిషనర్ ప్రహ్లాదను కోరారు. ఈమేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో ఎక్కడా చూసిన ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో భోజనం, టిఫిన్ ప్లేట్లలో కవర్లు వాడుతున్నారని తెలిపారు. ఇలా వాడటంతో మానవశరీరంలోకి ప్లాస్టిక్ కణాలు వెళ్లి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. చిత్రావతి నదిలో వ్యర్థాలు వేస్తున్నారని, దీంతో భక్తులకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు.

బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: టీడీపీ నేతల చేతిలో దాడికి గురైన బాధితులను వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. పట్టణంలోని 8వార్డు చిత్రావతి గుట్ట ప్రాంతంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సందీప్, గోపాల్‌ను బుధవారం రాత్రి టీడీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, పవన్‌కుమార్, నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, అలీబాయ్ తదితరులు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బాధితులను ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

పుట్టపర్తి టౌన్: పురపాలక సంఘం పరిధిలో ఫ్లెక్సీ బోర్డులు, బ్యానర్ల ఏర్పాటుకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని కమిషనర్ ప్రహ్లాద సూచించారు. ఈమేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీ బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేస్తే తొలగిస్తామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం



మీడియాతో మాట్లాడుతున్న నాగేంద్రనాథ్

కదిరి: ఎస్సీ, ఎస్టీ ఆర్టీసీ ఉద్యోగుల శాఖాపరమైన సమస్యల పరిష్కారంలో తాము ముందుంటామని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కదిరి డిపోలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, వారికి అండగా తమ యూనియన్‌తో పాటు జై భీమ్ అసోసియేషన్ పని చేస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు యూనియన్ దృష్టికి తీసుకొస్తే సంబంధిత ఉన్నతాధికారులను కలిసి పరిష్కరిస్తామని భరోసా నిచ్చారు. ఎంఈఎఫ్ రీజనల్ కార్యదర్శి ఆర్‌జీ నాయక్, ఎమ్మార్పీఎస్ నియోజక వర్గ నేత విశ్వనాథ్, జైభీమ్ అసోసియేషన్ కదిరి డివిజన్ కార్యదర్శి గంగాద్రి, గంగరాజు, జీఎన్ స్వామి, రమణప్ప పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుకు గ్రీన్‌సిగ్నల్

- ఉపాధి హామీ ద్వారా వంద శాతం సబ్సిడీ
- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు అవకాశం



మల్లాకాలువ వద్ద మామిడి మొక్కలు నాటేందుకు గుంతలు తీసి పనులు ప్రారంభిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం కింద విరివిగా పండ్ల తోటల సాగు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పండ్ల తోటల అభివృద్ధితో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించడానికి కేంద్రం ఉపాధి హామీ ద్వారా ఏటా విరివిగా నిధులను మంజూరు చేస్తోంది. ఇటీవల వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు చక్కటి అవకాశం ఏర్పడింది. అందులో భాగంగా పండ్ల తోటలు సాగు చేసుకునే రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి అర్హులను ఎంపిక చేసి వారి పొలాల్లో పండ్ల తోటలను సాగు చేసుకునేందుకు అధికారులు మార్కింగ్‌లు ఇస్తున్నారు. మార్కింగ్ ఇచ్చిన పొలాల్లో రైతులు కూలీల ద్వారా గుంతలు తవ్వడం, మొక్కలు నాటే పనులు చేపట్టడానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

వంద శాతం సబ్సిడీ

పండ్ల తోటలను అభివృద్ధి చేసుకుంటే కరువును తరిమికొట్టడమే కాకుండా రైతులు ఆర్థికంగా ఎంతో బలపడే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో పండ్ల తోటల అభివృద్ధికి ప్రోత్సాహకాలను అందించారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో 12,400 హెక్టార్లలో వివిధ రకాల పండ్ల తోటలు రైతులు సాగు చేసుకున్నారు. ప్రస్తుతం (2024–25) ఉపాధి హామీ కింద 100 శాతం సబ్సిడీతో పండ్ల తోటలను అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పిస్తోంది. ఇందుకు ఐదు ఎకరాలలోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు సన్న, చిన్న కారు రైతులు అర్హులే. జాబ్ కార్డ్‌తో పాటు భూమి పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉంటే పండ్ల తోటల సాగుకు వంద శాతం సబ్సిడీ లభిస్తుంది.

అన్ని రకాల తోటల అభివృద్ధికి అవకాశం

ఉపాధి హామీ పథకం కింద అన్ని రకాల పండ్ల తోటలను అభివృద్ధి చేసుకోవచ్చు. 100 శాతం సబ్సిడీపై గులాబీ, మల్లె తోటలతో సహా 17 రకాల పండ్ల తోటల అభివృద్ధికి అవకాశం ఉంది. ఎక్కువగా దీర్ఘకాలిక పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తారు. మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, కొబ్బరి, సీతాఫలం, చింత, రేగు, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్స్, అంజూర, పూల తోటలకు సంబంధించి గులాబీ, మల్లె తోటలను అభివృద్ధి చేసుకోవచ్చు. మునగ, మల్లె, గులాబీ, రేగు తోటలకు మెయింటెనెన్స్ బిల్లులు రెండేళ్ల కాగా.. మిగిలిన వాటికి మూడేళ్ల పాటు బిల్లులు చెల్లిస్తారు.

మూడేళ్లలో చెల్లించే సబ్సిడీ (ఏడాదికి 5 ఎకరాలకు గాను)

పంట రకం	చెల్లించే మొత్తం
మామిడి	రూ.99,911
చీనీ	రూ.1,26,702
నిమ్మ	రూ.1,33,911
జామ	రూ.1,35,288
సీతాఫలం	రూ.1,90,114
దానిమ్మ	రూ.1,96,019
గులాబీ	రూ.1,90,000
మల్లే	రూ.144,072
నేరేడు	రూ.61,793
చింత	రూ.60,999
అంజూర	రూ.1,66,997
మునగ	రూ.91,776

నీటి వసతి లేకపోయినా అవకాశం

- గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పండ్ల తోటల అభివృద్ధికి నీటి వసతి కచ్చితంగా ఉండాలనే నిబంధన లేదు.
- మెట్ట భూములు, చౌడు భూముల్లో కూడా పండ్ల తోటలను అభివృద్ధి చేసుకోవచ్చు.
- రైతులు తమ పరిసర ప్రాంతాలలో చెరువు లేదా కాలువలు, డగ్గౌట్ పాండ్‌లు, ఇతర నీటి సదుపాయం ఉన్నా పండ్ల తోటలకు అర్హులే.
- ఏదో విధంగా ఎండాకాలంలో మొక్కలను బతికించుకోవాలి. అందుకు ఉపాధి హామీ పథకం కింద నీటి బిల్లులు చెల్లిస్తారు. దీనినే డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం అని కూడా అంటారు.
- సాధారణంగా చౌడు నేలలను పనికిరాని నేలలుగా వ్యవహరిస్తారు.
- ఉపాధి కింద చౌడు నేలల్లోనూ సీతాఫలం, నేరేడు, జామ, సపోట వంటి మొక్కలు నాటుకోవచ్చు. అయితే సమీపంలో నీటి వసతి తప్పనిసరి. మిగిలిన తోటల అభివృద్ధికి బావి లేదా బోరు ఉండాలి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే అర్హత ఉన్న రైతుల పొలాల్లో పండ్ల తోటలు, పూల తోటల సాగుకు పనులు మొదలు పెట్టించాం. ప్రభుత్వం అందించే నాణ్యమైన మొక్కలను రైతులు ఎంపిక చేసుకుని నాటుకోవాలి.

– అనిల్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ, ధర్మవరం మండలం

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీఓ మహేష్ అధికారులకు సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రతి అధికారి సమయపాలన పాటించాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే సమస్యలను అక్కడే సాధ్యమైనంత వరకు తీర్చాలన్నారు. డీఏఓ కతిజున్‌కుబ్రా, ఏఎస్ఓ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ అంపయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నూతన ఆర్డీఓ మహేష్‌కు సన్మానం

ధర్మవరం ఆర్డీఓ మహేష్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీబీ భాస్కర్ రెడ్డి, తాలూకా అధ్యక్షుడు తిరుపాలు తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి సాయిప్రకాష్, సభ్యులు ఓబిలేసు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి ఎంపీడీఓగా రంగారావు



రంగారావు



సాయి మనోహర్



విజయ్‌భాస్కర్

తాడిమర్రి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా రంగారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న విజయలక్ష్మి రాప్తాడుకు బదిలీ అయ్యారు. తాడిపత్రిలో పని చేస్తున్న రంగారావు ఇక్కడికి వచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎంపీడీఓ పేర్కొన్నారు.

బత్తలపల్లి: బత్తలపల్లి ఎంపీడీఓగా నరసింహనాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సాయిమనోహర్ ధర్మవరం బదిలీ అయ్యారు. లేపాక్షిగా విధులు నిర్వహిస్తున్న నరసింహనాయుడును ఇక్కడికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మవరం రూరల్: ధర్మవరం ఎంపీడీఓగా సాయి మనోహర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బత్తలపల్లి నుంచి బదిలీపైఇక్కడి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బ ఎంపీడీఓగా విజయ్ భాస్కర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కవిరాజ్ బదిలీపై రొళ్లకు వెళ్లారు. గార్లదిన్నెలో పనిచేస్తున్న విజయ్‌భాస్కర్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపారు.



బత్తలపల్లి: ప్రత్యేక అలంకరణలో కొల్లాపురమ్మ అమ్మవారు



తాడిమర్రిలో బాలా త్రిపుర సుందరిగా వాసవీమాత



ధర్మవరం అర్బన్ ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మదేవత



ధర్మవరం అర్బన్: రాజరాజేశ్వరిగా లక్ష్మీచెన్నకేశవస్వామి



బుక్కపట్నం మండలం జానకంపల్లిలో దుర్గమ్మ



కదిరిలో కంచికామాక్షి అవతారంలో వాసవీమాత

దుర్గామాతా నమోస్తుతే

సాక్షి బృందం: ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యారు. అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్ల ప్రతిమలను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



అమడగూరు: బాలత్రిపుర సుందరి దేవిగా చౌడేశ్వరి



ముదిగుబ్బ: పార్వతిదేవి అలంకరణలో వాసవీమాత

నూతన సాంకేతికతతో లాభసాటి వ్యవసాయం



చింతపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఎన్పీకుంట: నూతన సాంకేతికతతో వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని ఏఓ లోకేశ్వరరెడ్డి పేర్కొన్నారు. జౌకల, ఎన్.పీ.కుంట–1 రైతు సేవా కేంద్రాల పరిధిలో గురువారం వ్యవసాయ,అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లోదుక్కులు, నేలల ఆరోగ్యం కాపాడుకోవడం, మల్చింగ్ విధానం, పొలాలకు చెరువు మట్టిని తోలుకోవడం, పొలాలకు గట్లు నిర్మించుకోవాలన్నారు. అలాగే బోర్వెల్ రీచార్జ్ బిట్స్ ఏర్పాటు చేసుకోవడం, ఎకరా పొలంలో కనీసం రెండు సెంట్ల ఫారం పాండ్ నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందించుకోవచ్చన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ఆయా శాఖలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. పశువైద్యాధికారి డాక్టర్ బాలానాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ధర్మవరం రూరల్: వరి పంటలో సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులను సాధించవచ్చని ఏఓ ముస్తఫా రైతులకు సూచించారు. గురువారం వసంతపురం, చింతలపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపల్లిలో రైతు నాగభూషణ సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. పట్టు సాగు వల్ల ఉపయోగాలను పట్టు పరిశ్రమ అధికారి దామోదర్‌రెడ్డి వివరించారు. పశు వైద్యాధికారి శేఖర్, ఏఈఓ అశ్విని, బాబయ్య, ఎంపీఈఓ స్వాతి, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఓడీచెరువు: మండలంలోని డబురువారిపల్లి, ఆకుతోటపల్లిలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీ సనావుల్లా, ఏఓ అబ్దుల్ అలి వరి, టమాట పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో నల్లి నివారణ చర్యలను తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ అహ్మద్, పట్టుపరిశ్రమ శాఖ ఏడీ గీత, ఎస్ఓ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: అంతర పంటలతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని ఏఓ భారతి అన్నారు. చెవిటివారిపల్లి, మద్దిమడుగు గ్రామంలో గురువారం ఏఓ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏపీఓ మంజుల, వీఏఏ ప్రశాంతి పాల్గొన్నారు.

కనగానపల్లి: రైతులు సీజన్‌ను బట్టి సకాలంలో పంటలు సాగుచేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ క్రిష్ణకుమారి తెలిపారు. తగరకుంట గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడులను వ్యవసాయాధికారులు పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈసారి పంట దిగుబడులు చాలా తగ్గాయని రైతులు తెలిపారు. సర్పంచ్ మాధవరాజులు, వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు రాజ్‌కుమార్, బొమ్మయ్య పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు







డివైడర్‌ను ఢీ కొన్న లగేజీ వ్యాను , గాయపడిన రామాంజనేయులు, కారు డ్రైవర్ అరుణ్‌కుమార్

బత్తలపల్లి: స్థానిక బైపాస్ రోడ్డులో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. గురువారం తెల్లవారుజామున ధర్మవరం నుంచి అనంతపురానికి బాయిలర్ కోళ్లను తీసుకెళ్తున్న లగేజీ వ్యాను ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే ప్రయత్నంలో డివైడర్‌ను ఢీ కొంది. ప్రమాదంలో డ్రైవర్ చాంద్‌బాషా, క్లీనర్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. వ్యానులో ఉన్న బాయిలర్ కోళ్లు 50 వరకు మృతి చెందాయి. పెద్దపప్పూరు మండలం సోమనపల్లికి చెందిన రామాంజనేయులు తన కుమార్తెను పిలుచుకెళ్లాలని కారులో మన్నీల గ్రామానికి వెళ్తుండగా, అనంతపురం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్న లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో రామాంజనేయులుతో పాటు కారు డ్రైవర్ అరుణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహకారంతో పోలీసులు వారిని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న దృశ్యం

కదిరి: వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కదిరి ఫారెస్ట్ రేంజ్ అధికారి గుర్రప్ప అన్నారు. వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక బ్లూమూన్ పాఠశాలలో 'వన్య ప్రాణుల సంరక్షణ' అనే అంశంపై ఫారెస్ట్ అధికారులు పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉందని, అలాగే వన్య ప్రాణులకూ ఆ హక్కు ఉందన్నారు. రైతులు తమ పంట పొలాల రక్షణ కోసం కరెంటు తీగలు ఏర్పాటు చేస్తుండటంతో ఎన్నో మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. రోడ్డు దాటుతూ అనేక వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రామచంద్రనాయక్, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు రామచంద్రారెడ్డి, దామోదర్, ఫారెస్ట్ బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఓడీచెరువు: మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ పూల రెడ్డప్ప, ఈఓఆర్డీ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్‌ను ఉద్యోగులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఎంపీపీ తుమ్మల పర్వీన్ భాను, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట

కదిరి: కందికుంట నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన తన స్వగృహంలో ఆవిష్కరించారు. గుండె, కిడ్నీ, క్యాన్సర్, కీళ్ల నొప్పులు, షుగర్, బీపీ, గ్యాస్ట్రిక్ వంటి వ్యాధులకు ఉచిత వైద్యం చేయించుకోవచ్చన్నారు. బెంగళూరుకు చెందిన వైదేహి ఆసుపత్రి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ నగేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



గంగినేపల్లిలో పరీక్షలు చేస్తున్న 104 సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: ప్రజలు నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. లేకపోతే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వైద్య సిబ్బంది అన్నారు. గురువారం మండల పరిధిలోని గంగినేపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. రాత్రి సమయంలో దోమకాటుకు గురికాకుండా వేపాకు పొగ వేసుకోవాలన్నారు. దోమ తెరలను తప్పనిసరిగా వాడాలని తెలిపారు. నివాస ప్రాంతాల చుట్టూ మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ వెంకటనారాయణ, సీహెచ్ఓ ఐశ్వర్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం క్రిష్ణవేణి, ఆశావర్కర్లు రాజేశ్వరి, పెద్ద రాజేశ్వరి, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలు





తీవ్రంగా గాయపడిన గౌస్‌పీరా, ఓబులప్ప



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీదేవి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో గురువారం ఆర్టీసీ బస్సు ఆటోను వెనుకవైపు నుంచి ఢీకొనడంతో ముగ్గురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు... పట్టణంలో నుంచి బత్తలపల్లికి ప్రయాణికులతో వెళుతున్న ఆటోను మార్కెట్‌యార్డు సమీపంలో పుట్టపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శ్రీదేవి, గౌస్‌పీరా, ఓబులప్ప స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.